క్లుప్తంగా

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు

మాడుగులపల్లి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఇందుగుల గ్రామంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్ష్యులు, 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. ఇందుగుల గ్రామానికి చెందిన మిర్యాల సైదిరెడ్డి బైక్‌పై పొలం వద్దకు వెళ్లి సాయంత్రం 7 గంటల సమయంలో తిరుగు ప్రయాణమయ్యాడు. చెర్లగూడెం గ్రామానికి చెందిన సైదులు తన ద్విచక్ర వాహనంపై తల్లి మారెమ్మతో కలిసి మాడుగులపల్లికి వెళ్లి వస్తున్నాడు. ఇందుగుల సీపీఎం కార్యాలయం సమీపంలోకి రాగానే ఈ రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరకు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటన తమ దృష్టికి రాలేదని పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

గుర్రంపోడు: వ్యక్తి అదృశ్యమైన ఘటన గుర్రంపోడు మండలం తేనపల్లిలో బుధవారం వెలుగుచూసింది. తేనపల్లి గ్రామానికి చెందిన శివార్ల వెంకటయ్య(50) మంగళవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

దేవరకొండ: చందంపేట మండలం పోలేపల్లి గ్రామానికి చెందిన పలువురు బుధవారం దేవరకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి బాలునాయక్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు జాల నర్సింహారెడ్డి, చందంపేట ఎంపీపీ పార్వతీచందునాయక్, జెడ్పీటీసీ బుజ్జిలచ్చిరాంనాయక్, పవన్, లెండాల మోహన్, లోకేశ్‌నాయక్, సూర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారుడికి ఆర్థికసాయం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): నేపాల్ దేశ రాజధాని ఖాట్మండులో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న ఇండో–నేపాల్ ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్–2023లో భాగంగా నిర్వహించనున్న అండర్–19 కబడ్డీ పోటీలకు మండలంలోని సుంకిశాల తండాకు చెందిన రమావత్ చరణ్ ఎంపికయ్యాడు. విషయం తెలుసుకున్న బోయగూడెం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ నెమలి మాధవరెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం పంపించగా బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు చరణ్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాశిమళ్ల చిట్టి, నాగాచారి, నగేష్, జబ్బార్, లాలు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మిర్యాలగూడ టౌన్: స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన పల్‌రెడ్డి ఫౌండేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్: పట్టణ పరిధిలోని బకల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల, బాలికల జెడ్పీహెచ్‌ఎస్‌లలో బుధవారం పల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 8వ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) ఎంట్రెన్స్ టెస్ట్‌కు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ పి. నర్సింహారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రజితమ్మ, లీగల్ లిటరసీ క్లబ్ ఇన్‌చార్జి కస్తూరి ప్రభాకర్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: నిడమనూరు జెడ్పీహెచ్‌ఎస్‌లోని 8వ తరగతి విద్యార్థులకు పల్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ నరసింహారెడ్డి ఎన్‌ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.

రన్నర్‌లకు షూ అందజేత



రన్నర్‌లకు షూ అందజేసిన డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

నిడమనూరు: మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన మారథాన్ రన్నర్‌లు మంజుల రఘువీర్, అల్లాటి మనోజ్‌కు డీఎస్పీ నూకల వేణుగోపాల్‌రెడ్డి బుధవారం రన్నింగ్ షూ అందజేశారు. ముకుందాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ ఇద్దరూ మారథాన్ రన్నింగ్ పట్ల ఎంతో ఇష్టంతో ప్రాక్టీస్ చేస్తున్నారు. వారి ప్రాక్టీస్ మెరుగుపడటానికి వీలుగా రూ.25వేల విలువైన రెండు జతల షూను నూకల వేణుగోపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సాయికృష్ణ, సైదిరెడ్డి, షరీఫ్, రామాంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన మీసేవ కేంద్రాలు

- 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకునేందుకు పోటెత్తిన దరఖాస్తుదారులు



కొండమల్లేపల్లిలో మీసేవ కేంద్రం వద్ద బారులు తీరిన జనాలు

మిర్యాలగూడ టౌన్: సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునేందుకు గృహలక్ష్మి పథకం ద్వారా రూ.3లక్షలు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో బుధవారం మీసేవ కేంద్రాలకు దరఖాస్తుదారులు పోటెత్తారు. మిర్యాలగూడ తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, మున్సిపాలిటీలో ప్రత్యేక సెంటర్లు ఏర్పాటు చేశారు. దీంతో మండలంలోని 46 గ్రామ పంచాయతీల నుంచి తహసల్దార్ కార్యాలయంలో 500, ఆర్డీఓ కార్యాలయంలో 300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ మున్సిపాలిటీలోని 48 వార్డుల కోసం ఏర్పాటు చేసిన ఆరు సెంటర్లలో 247 మంది లబ్ధిదారులు ఈ పథకానికి దరఖాస్తులు చేసుకున్నారు. కాగా దరఖాస్తు గడువు దగ్గర పడుతుండటంతో దరఖాస్తులు స్వీకరించే కేంద్రాల వద్ద తోపులాటలు చోటుచేసుకున్నాయి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దళారులను ఆశ్రయించడంతో వారు పెద్దఎత్తున డబ్బులు దండుకున్నారు. జిరాక్స్ సెంటర్ల వద్ద కూడా ప్రజలు బారులు తీరారు. ఆయా కేంద్రాలను మండల తహసీల్దార్ అనిల్‌కుమార్, మున్సిపాలిటీలోని కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పర్యవేక్షించారు.

కొండమల్లేపల్లిలో..

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులో గల మీసేవ కేంద్రం వద్ద గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం జనాలు బారులు తీరారు. దరఖాస్తు చేసుకునేందుకు గురువారం చివరి తేదీ అని, మరికొందరు ఈ నెల 12వ తేదీ అని చెప్పడంతో కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం ప్రజలు తరలివచ్చారు.

త్రిపురారంలో...

త్రిపురారం: గృహలక్ష్మి పథకాన్ని దరఖాస్తు చేసుకోవడానికి గడువు సమీపిస్తుండడంతో బుధవారం మండలంలోని వివిధ గ్రామాల నుంచి దరఖాస్తుదారులు పెద్దఎత్తున మండల కేంద్రానికి రావడంతో సాగర్ రోడ్డు కిటకిటలాడింది. మీసేవ కేంద్రాల వద్ద మోటారు సైకిళ్ల పార్కింగ్ చేయడానికి వీల్లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కొందరు మహిళలు చిన్నపిల్లలను తీసుకొని దరఖాస్తు చేసుకోవడానికి వచ్చారు.

అడవిదేవులపల్లిలో..

అడవిదేవులపల్లి: మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు చెందిన లబ్ధిదారులు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం మండల కేంద్రానికి తరలివచ్చారు. మండల కేంద్రంలో ఒక్కటే మీసేవ కేంద్రం ఉండటంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా దరఖాస్తుదారులు బారులు తీరారు.

గుర్రంపోడులో..

గుర్రంపోడు: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం దరఖాస్తుదారులు పోటెత్తారు. ప్రత్యేక కౌంటర్ ద్వారా 530 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కుల, ఇతర ధ్రువపత్రాల కోసం మీసేవా కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది.

గడువు పొడిగించాలి



గృహలక్ష్మి పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 10వ తేదీ చివరి తేదీ అని చెప్పడంతో మీ సేవా కేంద్రానికి వచ్చాను. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎక్కువ మంది ప్రజలు రావడంతో బారులు తీరారు. ప్రభుత్వం దరఖాస్తు గడువును పొడిగించాలి.

– పవన్‌కుమార్, కొండమల్లేపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరకొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి దేవరకొండ పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలం ఆములూరుకు చెందిన గనిపల్లి పెదవెంకన్న(50) బుధవారం బైక్‌పై దేవరకొండకు వచ్చి తిరిగి రాత్రి స్వగ్రామానికి బయల్దేరాడు. ఈ క్రమంలో దేవరకొండ పోలీస్ స్టేషన్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా మిర్యాలగూడ నుంచి దేవరకొండ వైపునకు వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వెంకన్నను పోలీసులు దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై తమకెలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మాటూరులో జానారెడ్డి పల్లె నిద్ర

త్రిపురారం: ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీపీసీసీ పిలుపు మేరకు త్రిపురారం మండలంలోని మాటూర్‌లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి బుధవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా గిరిజనులసమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్ రెడ్డి, ధనావత్ భాస్కర్‌నాయక్, ధనావత్ వెంకట్రాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘాశీరాంతండాలో..

గుర్రంపోడు: మండలంలోని ఘాశీరాంతండాలో మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కంచర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చనమల్ల మాధవీ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



మిర్యాలగూడ టౌన్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



దేవరకొండ: యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తున్న నాయకులు



పెద్దవూరలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ మిర్యాలగూడ నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్‌కె అజారుద్దీన్ యువజన కాంగ్రెస్ జెండాను ఎగురవేశారు. అనంతరం పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి తదితరులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో అబ్దుల్లా, సికిందర్, సతీష్‌నాయుడు, అశోక్, మజ్జు, చంటి, చిలుక విజయ్ తదితరులున్నారు.

దేవరకొండలో..

దేవరకొండ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా యువజన కాంగ్రెస్ జెండాను యువజన కాంగ్రెస్ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ యూనుస్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కేతావత్ శ్రీధర్‌నాయక్, ఎండీ ఉమేర్, కొర్ర నాగరాజు, కొర్ర గౌతమి తదితరులున్నారు.

తిరుమలగిరిలో..

తిరుమలగిరి(నాగార్జునసాగర్): యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు పగడాల నాగరాజు యూత్ కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో అనుముల అంజి, మేరావత్ ముని నాయక్ తదితరులు పాల్గొన్నారు.


చింతపల్లిలో..

చింతపల్లి: మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వర నగర్‌లో యువజన కాంగ్రెస్ కాంగ్రెస్ జెండాను ఎంపీపీ కొండూరు భవానీపవన్‌కుమార్ తదితరులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, నాయకులు నగేశ్, ఖలీల్‌బేగ్, మహేశ్, మల్లేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూరలో..

పెద్దవూర: యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, యువజన కాంగ్రెస్ నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఐతగోని సతీష్‌గౌడ్, మండల అధ్యక్షుడు కిలారి మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మన్నెం' పుట్టినరోజు వేడుకలు



రంజిత్‌యాదవ్‌ను గజమాలతో సన్మానిస్తున్న అభిమానులు, నాయకులు

హాలియా: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మన్నెం రంజిత్‌యాదవ్ జన్మదిన వేడుకల సందర్భంగా బుధవారం హాలియాలో 600 బైకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో క్రేన్‌తో భారీ గజమాలతో అభిమానులు, నాయకులు ఆయనను సన్మానించారు. 2వేల మంది కార్యకర్తలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో హాలియా మున్సిపల్ చైర్మన్ వెంపటి పార్వతమ్మ, కౌన్సిలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వర్ర వెంకట్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రావుల చినభిక్షం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు రావుల రాంబాబు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత..

హాలియా పట్టణంలోని 3వ వార్డుకు చెందిన చాగంటి బాల ఏసు అనారోగ్యంతో మృతిచెందగా.. బుధవారం రంజిత్‌యాదవ్ మృతుడి కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు.

బాధ్యతతో చదివి హక్కులకు పోరాడాలి



మాట్లాడుతున్న ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ కేంద్ర నాయకుడు రవినాయక్

మిర్యాలగూడ అర్బన్: ఆదివాసీ విద్యార్థులందరూ బాధ్యతో చదివి తమ హక్కుల కోసం పోరాడాలని ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ కేంద్ర నాయకుడు రవినాయక్ అన్నారు. బుధవారం మిర్యాలగూడ మండలంలోని అవంతీపురంలో గల తెలంగాణ గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గిరిజన సంఘం, విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశంలో గిరిజన తెగల మధ్య దాడులను ప్రోత్సహిస్తూ వారిని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. గిరిజన తెగల ఐక్యత కోసం నేటితరం యువకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపాల్ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ ముజుబుద్దీన్, సక్రునాయక్, మంగానాయక్, ముడావత్ రవినాయక్, ఉపేందర్, రవికిరణ్, నాగయ్య, రాజు తదితరులున్నారు. అదేవిధంగా ప్రపంచ గిరిజన హక్కుల దినోత్సవం సందర్భంగా నరసాపురం గ్రామంలో గిరిజన సంఘం జెండాను సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోతు వినోద్‌నాయక్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భూక్యా విజయ్ నాయక్, సురేష్, మేశ్య, వినోద్ తదితరులున్నారు.

'కల్యాణలక్ష్మి'తో కొండంత భరోసా



దేవరకొండ: లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం కొండంత భరోసా కల్పిస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చింతపల్లి మండలానికి చెందిన 140 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.1.40కోట్ల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. మహిళా సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అన్నారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో చింతపల్లి జెడ్పీటీసీ కంకణాల ప్రవీణవెంకట్‌రెడ్డి, నాయకులు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రావు, మాన భాస్కర్, రవి, శ్రీశైలం, మోహన్ తదితరులున్నారు.

నివాళులర్పించిన ఎమ్మెల్యే..

కొండమల్లేపల్లి: మండల కేంద్రానికి చెందిన మహ్మద్ జహంగీర్ బీ మృతి బాధాకరమని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లిలో జహంగీర్ బీ మృతదేహానికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగేంధర్‌రెడ్డి, రమావత్ దస్రూనాయక్, గంధం సురేష్ తదితరులు ఉన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



హాలియా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే భగత్

హాలియా: రాష్ట్రంలోని ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నాగార్జునసాగర్ మెమ్మెల్యే నోముల భగత్ అన్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు ఈద్గా, ఖబరస్తాన్‌లు మంజూరైన సందర్భంగా బుధవారం హాలియాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద ముస్లిం కుటుంబాల్లోని ఆడపిల్లల పెళ్లిళ్లకు షాదీముబారక్ పథకం ద్వారా ప్రభుత్వం రూ.1,00,116 అందజేస్తుందని పేర్కొన్నారు. లబ్ధిదారులందరూ బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి, సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం నార్టీ నాయకులు షేక్ అబ్బాస్, బాబుద్దీన్, బషీర్, మున్నా, సలీం, అన్వరుద్దీన్, అజ్గర్, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ..

పెద్దవూర: ఇటీవల మృతిచెందిన పెద్దవూర మండలంలోని పర్వేదుల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దేవసాని శశిపాల్‌రెడ్డి దశదిన కర్మకు బుధవారం ఎమ్మెల్యే నోముల భగత్‌హాజరై నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, నాయకులు గజ్జెల లింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి, కర్ణ బ్రహ్మారెడ్డి, జటావత్ రవినాయక్, సర్పంచ్ దండ మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోని ప్రభుత్వం



మిర్యాలగూడ అర్బన్: సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు నాగార్జున

మిర్యాలగూడ అర్బన్: సంక్షేమ హాస్టళ్లను ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదని కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన కేవీపీఎస్ నియోజకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లకు గత 9 నెలలుగా మెస్ బిల్లులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై సర్వే నిర్వహించామని తెలిపారు. జిల్లా అధికారుల పర్యవేక్షణ లోపంతో సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా మారాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రెమడాల పరశురాములు, కోడిరెక్క మల్లయ్య, దైద దేవయ్య, పాపారావు, వెంకులు, రమేష్, శివ తదితరులున్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో వసతులు కల్పించాలి

త్రిపురారం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని కుల వివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పలు హాస్టళ్లను సందర్శించి వసతులను పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొన్నిచోట్ల హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. బియ్యంలో పురుగులు ఉంటున్నాయని, రూంలలో లైటింగ్ సరిగా లేకపోవడంతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్ అద్దె భవనంలో కొనసాగుతోందని, సొంత భవనం నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి దైద శ్రీను, మండల అధ్యక్షుడు మేకల వెంకన్న, ఇంజమూరి శివ, మధు పాల్గొన్నారు.

సైనికులు.. దేశ ప్రజలకు ఆదర్శం



దేవరకొండ: రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

దేవరకొండ: దేశ రక్షణకై తమ ప్రాణాలను లెక్క చేయకుండా విధులు నిర్వహించే సైనికులు దేశ ప్రజలందరికీ ఆదర్శమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేతావత్ లాలునాయక్, కర్నాటి సురేష్ అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో పలువురు రిటైర్డ్ ఆర్మీ జవాన్లు, వారి కుటుంబ సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా మేరా మిట్టి మేరా దేశ్ పేరుతో ఈ నెల 30వరకు దేశ వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలకు బీజేపీ కేంద్ర పార్టీ రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా మొదటి రోజు ఆర్మీ జవాన్లు, వారి కుటంబ సభ్యులను సన్మానించినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, ఫ్లోర్ లీడర్ గాజుల మురళి, పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్య, ఉప్పల వెంకటేష్, రెడ్డి శంకర్, జల్దా భాస్కర్, సహదేవుడు, చంద్రీశ్వర్ తదితరులున్నారు.

మాజీ సైనికులకు సన్మానం

మిర్యాలగూడ టౌన్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మాజీ సైనికులు దోమకొండ సుధాకర్, పందాల నరేందర్‌గౌడ్, యడవల్లి వెంకటేశ్వర్లు, రంగాచారి, మేరెడ్డి కృష్ణారెడ్డిను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బాణావత్ రతన్‌సింగ్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు దొండపాటి వెంకట్‌రెడ్డి, సీతారాంరెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

డీసీపీని సస్పెండ్ చేయాలి

దేవరకొండ: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని సెక్రటరియేట్ ముట్టడికి వెళ్లిన ఏఐఎస్‌ఎఫ్ నాయకులపై భౌతిక దాడులకు పాల్పడిన డీసీపీ వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేయాలని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు వంగూరి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎండీ సొభాన్, రమేష్, బాలాజీ తదితరులున్నారు.

చింతపల్లి: విద్యార్థి సంఘాలు, మీడియా విద్యాలయాల్లోకి రావొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సెక్రెటేరియట్ ముట్టడి తలపెట్టిన విద్యార్థి సంఘాల నాయకులపై దాడికి పాల్పడిన డీసీపీ వెంకటేశ్వర్‌రావును సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ దేవరకొండ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి షేక్ శంషాద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

పోషకాహారం తీసుకోవాలి

కొండమల్లేపల్లి: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని కొండమల్లేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి సూచించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న సుమారు 25 మంది గర్భిణులకు ఆరోగ్యలక్ష్మి కార్యక్రమంలో భాగంగా భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తిప్పర్తి రాధా వరలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

అడవిదేవులపల్లి: మండలంలోని మొల్కచర్ల గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం హెచ్‌ఎం వెంకట్రాంనాయక్ ప్రభుత్వం అందజేస్తున్న రెండు జతల యూనిఫాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

'గృహలక్ష్మి' గడువు పొడిగించాలని వినతి

మిర్యాలగూడ టౌన్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకునే గడువు పొడిగించాలని కోరుతూ బుధవారం మిర్యాలగూడ ఆర్డీఓ చెన్నయ్యకు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గదాగోని మహేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో రాజు, కృష్ణ, మధనాచారి, అంజి, వెంకటేశ్వర్లు, ఏసు తదితరులున్నారు.

పంట వివరాలు ఆన్‌లైన్ చేయాలి

మిర్యాలగూడ: రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఏడీఏ పోరెడ్డి నాగమణి అన్నారు. బుధవారం దామరచర్ల మండలంలోని దిలావర్‌పూర్ గ్రామంలో వానాకాలం సీజన్ పంటల నమోదు ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తమ పంటల వివరాలను గ్రామానికి సంబంధించిన ఏఈఓల వద్ద తప్పకుండా నమోదు చేయించుకోవాలని అన్నారు. రైతులు వరి పంటనే కాకుండా పప్పు ధాన్యాలైన కందులు, పెసలు, మినుములు, బొబ్బెర్లు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ మాలావత్ రమేష్ పాల్గొన్నారు.

పులిచర్లను మండలంగా ఏర్పాటు చేయాలి

పెద్దవూర: మండలంలోని పులిచర్ల గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని పులిచర్ల మండల సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం పర్వేదుల గ్రామంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజల సలహాలు, సూచనలు తీసుకుంటూ మండల ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు దేవసాని శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ దండ మనోహర్‌రెడ్డి, సభ్యులు ఆదిరెడ్డి, దండ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

పెద్దవూర: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి కోరె రమేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎస్‌ఎఫ్‌ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు అవుతున్నా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫాం అందలేదని అన్నారు. కార్యక్రమంలో సాయికుమార్, నవీన్, చందు, రవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

దేవరకొండ: క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని దేవరకొండ కోర్టు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి రవీందర్ అన్నారు. స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకొని బుధవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అసోసియేషన్ భవనంలో స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా న్యాయమూర్తి కె. కవిత ప్రారంభించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

చందంపేట: మండలంలోని బుడ్డోనితండా గ్రామ పరిధిలోని నల్లచెలమూల, దేవరచర్లతండాలను నూతన గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పెద్దమూల మాజీ సర్పంచ్ పాలగోని చిట్టెమ్మ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులను కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్షుడు జగదీశ్ అన్నారు. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేయాలని కోరుతూ బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు దాటినా నేటికి పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందలేదని అన్నారు. ప్రభుత్వం విద్యారంగంలో నెలకొన్న సమ్యలను పరిష్కరించాలని, లేదంటే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్, డీఈఓ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోపి, మనోజ్, శివ, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



హాలియా: ఆర్థికసాయం అందజేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

హాలియా: పట్టణంలోని 3వ వార్డుకు చెందిన చాగంటి బాల ఏసు అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి బుధవారం బాల ఏసు నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తిరుమలగిరి(సాగర్) వైస్ ఎంపీపీ యడవల్లి దిలీప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నిడమనూరులో..

నిడమనూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 30మంది నిరుపేదలు, దివ్యాంగులు, వృద్ధులకు బుసిరెడ్డి పాండురంగారెడ్డి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ యడవెల్లి దిలీప్‌రెడ్డి, మండల రైతు సమితి అధ్యక్షుడు అంకతి వెంకటరమణ, సర్పంచులు ఉన్నారు.